స్థలాల రిజిస్ట్రేషన్లలో మెలిక

- 0.5 శాతం చొప్పున అదనపు ట్యాక్స్ కట్టాలి
- వారసత్వ బదలాయింపునకూ తప్పని బాధలు
- స్థలాల యజమానుల గగ్గోలు
- ఏలూరు నగర పరిధిలో 757 ఖాళీ ప్రదేశాలు
- ఏటా రూ.70 లక్షల వరకు కార్పొరేషన్‌కు ఆదాయం


ఎన్ఆర్‌పేటలోని ఖాళీ స్థలం


ఎన్ఆర్‌పేటలో ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లలో మెలిక పెట్టడంతో స్థలాల యజమానులు లబోదిబో అంటున్నారు. స్థలాలు అమ్ముకోవాలన్నా, వారసులకు బదలాయించుకోవాలన్నా వీలు లేకుండా స్థలం విలువలో 0.5 శాతం మూడున్నర రెట్లు ట్యాక్స్ చెల్లించాలంటూ నిబంధన విధించింది. దీంతో ఏలూరు నగరంలో స్థలాల రిజిస్ట్రేషన్లు మందగించాయి. ఏటా నగరపాలక సంస్థకు ఇంటి పన్ను మాదిరిగా ఖాళీ స్థలాలకు పన్ను చెల్లిస్తున్నామని, ఐనా అదనపు ట్యాక్స్ ఏమిటంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్‌లో 50 డివిజన్లు, 79 సచివాలయాల పరిధిలో మొత్తం 757 ఖాళీ స్థలాలను అధికారికంగా గుర్తించారు. వీటికి ప్రతి ఏటా పన్ను విధిస్తున్నారు. నగరంలోని ఖాళీ స్థలాల ద్వారా ఏటా నగరపాలక సంస్థకు రూ.70 లక్షల వరకు పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది.

గుదిబండగా ట్యాక్స్

నగరంలో ఏదైనా స్థలం అమ్ముకోవాలన్నా, వారసులకు బదలాయించాలన్నా స్థలం విలువకు 0.5 శాతం చొప్పున మూడున్నర రెట్లు ట్యాక్స్ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ లెక్కన రూ.10 లక్షల విలువ చేసే స్థలం రిజిస్ట్రేషన్‌కు లక్షకు రూ.500 చొప్పున రూ.10 లక్షలకు రూ.5 వేలు. ఈ లెక్కన మూడున్నర రెట్లు రూ.17,500 అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. పైగా ఏటా నగరపాలక సంస్థకు చెల్లించే పన్ను షరా మామూలుగానే వసూలు చేస్తున్నారు. 100 గజాల స్థలం రిజిస్ట్రేషన్ విలువే రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. మెయిన్ సెంటర్లలో ఐతే 100 గజాల స్థలం రిజిస్ట్రేషన్ విలువ రూ.50 లక్షల వరకు ఉంది. అదనపు ట్యాక్స్ స్థలాల యజమానులకు గుదిబండగా మారింది. ఈ సమస్యపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడారు. అదనపు ట్యాక్స్ అంశాన్ని పూర్తిగా రద్దు చేయడం లేదా నామమాత్రంగా కట్టించుకోవడం సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలన చేయాలని కోరారు.

నయా దోపిడీ



రిజిస్ట్రేషన్ విలువలో 0.5 శాతం చొప్పున మూడున్నర రెట్లు చెల్లించాలని మెలిక పెట్టడం ప్రజల నుంచి డబ్బులు దోచుకునేందుకే. ప్రజలకు మేలు చేయాలనుకుంటే అదనపు ట్యాక్స్ చెల్లింపు నిబంధనను తొలగించాలి. ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఇతర మార్గాలను అన్వేషించాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

అదనపు భారాలెందుకు?



ఏటా వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) అధికారులు వసూలు చేస్తున్నారు. తాజాగా స్థల రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రేషన్ వాల్యూలో 0.5 శాతం చొప్పున మూడున్నర రెట్లు చెల్లించాలనడం దారుణం. ఒకే కుటుంబ సభ్యులు తమన వాటాలను విడదీసి బదలాయించుకోవాలన్నా తాజా నిబంధన అడ్డంకిగా మారింది.

– పి.ఆదిశేషు, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు, ఏలూరు

క్లుప్తంగా

సంపద షెడ్ల తనిఖీ


సంపద షెడ్లను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ అమ్మాజీ

దెందులూరు: చాటపర్రు గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏలూరు డీఎల్‌పీఓ. అమ్మాజీ శుక్రవారం పరిశీలించారు. సంపూర్ణ పారిశుద్ధ్యం అమలుకు గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సేవలందించాలని సూచించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు.

అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య పనులకు అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రయోగాత్మంగా అమలు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జాన్ బాబు కోరారు. శుక్రవారం సీఐటీయూ ప్రతినిధి బృందం ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వర్క్ అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్మికులకు రక్షణ లేని, హక్కులు లేని వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్‌లో ప్రయోగాత్మంగా ప్రవేశపెట్టినపుడు సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడితే ఆ విధానాన్ని నిలుపుదల చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే తక్షణమే జోక్యం చేసుకొని ఈ విధానాన్ని అమలు చేయకుండా చూడాలని కోరారు. నాయకులు ఎం ఇస్సాక్, జె.గోపి, పంపన రవికుమార్, అమర్ కుమార్ పాల్గొన్నారు.

రక్తదానానికి సహకరించండి


ఎస్పీ శివకిషోర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో తలసేమియా బాధిత చిన్నారులకు పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసేలా సహకరించాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌ను కోరినట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు, ఏలూరు జీజీహెచ్‌లో తలసేమియా చిన్నారులకు అందుతున్న వైద్య చికిత్సలను ఎస్పీకి వివరించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని ప్రసాద్ తెలిపారు.

కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి శ్రీకారం



విలేకర్లతో మాట్లాడుతున్న జయప్రకాష్


ఏలూరు టౌన్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని, దీనిలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్టు ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ తెలిపారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, వాటిలో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను ప్రారంభించారన్నారు. పులివెందుల, పాడేరు కాలేజీలు ఎన్నికల ఫలితాల నాటికి సిద్ధం చేశారని, మరో 10 కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వీటిని కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించేందుకు చూస్తోందని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి చావుదెబ్బ ఖాయమని అన్నారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, నగర మహిళ అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చిలకపాటి డింపుల్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లిపాక సురేష్, జిల్లా కార్యదర్శి తులసీ, మైనార్టీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల బాజీ, అనుబంధ విభాగాల నగర అధ్యక్షులు మేతర సురేష్, మట్టా రాజు, పిట్టా ధనుంజయ్, ఎచ్చర్ల ఉమామహేశ్వరరావు, మద్దాల ఫణి, బండ్లమూడి సునీల్‌కుమార్, ఉయ్యాల గణేష్, కొల్లిపర భగవాన్, లక్కబత్తుల ఏసుపాదం, కొవ్వాడ దుర్గారావు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పాతినవలస రాజేష్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ షమీం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్ : సీనియర్ సిటిజన్స్ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనంలో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వృద్ధులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుంటూ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని, అటువంటి కాల్స్ వస్తే భయపడకుండా పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్, సీబీఐ అధికారులు ఎవరూ ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టాలని డిమాండ్ చేయరని తెలిపారు. అనుమానాస్పద లింకులు ఓపెన్ వేయవద్దని సూచించారు. ఏదైనా మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో సైబర్ సెల్ ఎస్సై వల్లి పద్మ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

13న శ్రీ వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాల సమావేశం


శ్రీ వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, తిరుపతి – శ్రీ కాళహస్తి మధ్య మార్గంలో ఏర్పేడు వద్ద ఉన్న శ్రీ వ్యాసాశ్రమం త్వరలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోనున్న సందర్భంగా ఏలూరు నగరంలో ఈ నెల 13న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు శ్రీ వ్యాసాశ్రమ ఉత్తరాధికారి శ్రీ అసంగానంద గిరి స్వామీజీ, కళారత్న కేవీ సత్యనారాయణ తెలిపారు. శ్రీ వ్యాసాశ్రమ శత వసంతోత్సవాలకు భక్తులను ఆహ్వానించే నిమిత్తం శుక్రవారం నగరానికి విచ్చేసిన శ్రీ అసంగానంద గిరి స్వామీజీకి కేవీ సత్యనారాయణ తన స్వగృహంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శత వసంతోత్సవాల కరపత్రం విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు భక్తులను స్వయంగా ఆహ్వానించడానికి శ్రీ పరిపూర్ణానంద గిరి స్వామీజీ అక్టోబర్ 13న స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి సత్రానికి విచ్చేస్తున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి హోమాలు, ప్రసంగాలు, స్వామి వారి దివ్య సందేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు స్వీకరించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి


ముంగర సంజీవ్ కుమార్

దెందులూరు: పేద వర్గాల ప్రజలకు సంజీవినిగా ఉన్న ఆరోగ్యశ్రీ పథకం వైద్య సేవలను తక్షణమే పునరుద్ధరించాలని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం ఆగడాలలంకలో ఆయన మాట్లాడుతూ దివంగత నేత, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. వైఎస్సార్ కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేసి మూడు వేల వ్యాధులను 11 చేర్చి సమర్థవంతంగా అమలు చేశారని వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరు గారుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 16 నెలల కాలంలో ఆరోగ్యశ్రీ వైద్యశాలలకు పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేకపోయారని ప్రశ్నించారు. విద్య, వైద్య రంగాల్లో కూడా రాజకీయాలు చేయడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదా యాజమాన్యంతో మాట్లాడి వైద్య సేవలు పునరుద్ధరించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంజీవ్ కుమార్ డిమాండ్ చేశారు.

లక్ష్యం అధిగమించిన రవాణా శాఖ


షేక్ కరీమ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాహన తనిఖీలపై నెలకు రూ.85 లక్షలు చొప్పున గత ఏప్రియల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.5.10 కోట్లు ఏలూరు జిల్లాకు లక్ష్యం కాగా, రూ.5.80 కోట్లను సాధించామని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ శుక్రవారం తెలిపారు. 8,821 కేసులు నమోదు చేసి 114 శాతం లక్ష్యాన్ని సాధించామని చెప్పారు. ఇందులో ఫిట్నెస్ లేనందుకు 1,018 కేసుల ద్వారా రూ.24,83,000, పర్మిట్ లేనందుకు 374 కేసుల ద్వారా రూ.36,36,300, పన్ను చెల్లించనందుకు 2,273 కేసుల ద్వారా రూ.18,76,600, డ్రైవింగ్ లైసెన్స్ లేని 1,349 కేసుల్లో రూ.33,10,200, హెల్మెట్ ధరించని 1,319 కేసుల్లో రూ.10,90,000, వాహన ఇన్సూరెన్స్ లేని 1,357 కేసుల్లో రూ.27,48,000 అపరాధ రుసుము విధించామని వివరించారు. జిల్లాలోని మోటారు వాహన తనిఖీ అధికారులందరూ సమష్టిగా తనిఖీలు చేయడం వల్లే లక్ష్యాన్ని సాధించగలిగామని కరీమ్ తెలిపారు.

హీరో కృష్ణకు దాదా సాహెబ్ ఫాల్కే ప్రకటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివంగత సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించాలని ఏలూరు నగర కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ నాయకుడు అబ్దుల్ అలీషా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలను తన నటనతో రంజింప చేసి 350కు పైగా చిత్రాల్లో నటించి, సినీ రంగంలోని 24 విభాగాల కార్మికుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించి సినీ రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన గొప్ప సేవామూర్తి కృష్ణ అన్నారు. ఈ నెల 11న విజయవాడలో కె.సుధా స్వామి ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాలకు చెందిన సూపర్‌స్టార్ కృష్ణ సీనియర్ అభిమానుల ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సూర్ స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి


కమిషనర్ భానుప్రతాప్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరంలో 11, 30వ డివిజన్లలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కొత్త కార్మికుల నియామకం ఆప్కాస్ ద్వారానే చేపట్టాలని, రిటైర్ అయిన, చనిపోయిన ఆప్కాస్ కార్మికుల పిల్లలను ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కి వినతి పత్రం అందజేశారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ ప్రైవేటీకరించడం వల్ల ప్రస్తుత కార్మికుల జీతాలు, హక్కులు, రాయితీలకు తీవ్ర భంగం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రెండేళ్లుగా ఏలూరు నగరపాలక సంస్థలో దాదాపు 70 మంది కార్మికులు చనిపోవడమో, రిటైర్ కావడమో జరిగిందని, వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. మేయర్, ఎమ్మెల్యేలకు కూడా వినతిపత్రాలు అందజేశామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏలూరు నగర గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వర్లరావు (యూ.వీ.), ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కె.విజయలక్ష్మి, ఎ.దుర్గారావు తదితరులు ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు


మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): విభిన్న ప్రతిభావంతులకు తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక తంగెళ్లమూడిలోని మిషన్ ఆఫ్ చారిటీ విభిన్న ప్రతిభావంతుల గృహంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స చేయాలని, అందులో భాగంగా న్యాయ సేవాధికార సంస్థల తరఫున ఈ రోజు కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. న్యాయ సేవాధికార సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పీజే అమృతం, డీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, ప్యానల్ న్యాయవాది బి.సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

ఏలూరు (టూటౌన్): దేశంలోని ప్రతి పేదవాడి సంక్షేమానికి ఆత్మనిర్భర్ భారత్ ఎంతో దోహద పడుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక అన్నారు. ఏలూరులోని పెద్దబస్టాండ్ వద్ద గల అంబిక ఫ్లేవర్స్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీ విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

మహిళల భద్రతకు 'శక్తి యాప్'


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ అడ్మిన్ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు, యువతులు, విద్యార్థినుల రక్షణకు శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు సూచించారు. మహిళా భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై స్థానిక సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినుకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్, ర్యాగింగ్ వంటి అంశాలపై సూర్యచంద్రరావు మాట్లాడారు. అత్యవసర సాయం కోసం 112 లేదా 79934 85111 (శక్తి) నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. ప్రతి మహిళ, యువతులు తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలపై 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఏలూరులో మహిళల భద్రత కోసం 1 స్టాప్ సెంటర్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సెంటర్ వంటి సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: దెందులూరు మండలం రామారావుగూడేనికి చెందిన ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికంగా కూలి పనులు చేసుకునే చట్టుమాల డేవిడ్‌రాజు (50)కు భార్య, పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి ఇంటివద్దనే గుర్తు తెలియని కారణాలతో డేవిడ్‌రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యస్థితి విషమించటంతో అతను శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు జీజీహెచ్ వైద్యులు మెడికోలీగల్ కేసుగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: గౌహతికి చెందిన ఒక వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దీపాలు (33) వ్యక్తిగత పనుల నిమిత్తం గౌహతి నుంచి త్రిపురకు వివేకా ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. రైలు వేగంగా వెళుతుండగా దెందులూరు రైల్వే స్టేషన్ అలుగులగూడెం సమీపానికి వచ్చేసరికి ప్రమాదవశాత్తు దీపాలు జారిపడి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని శ్రీనివాస్ పేర్కొన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువుల పిల్లలు ప్రధాన మంత్రి ఉపకార వేతన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఎస్ కొండలరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025 – 2026 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా డిసెంబర్ 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, ఏలూరు వారి ఫోను నంబర్లు 08812 253687, 86888 17953లో సంప్రదించాలని పేర్కొన్నారు.

జీఎస్టీ 2.0 ర్యాలీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం కళాశాల అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రధానాచార్యులు గుత్తా గిరిబాబు ప్రారంభించి మాట్లాడారు.

అవగాహన అవసరం

దెందులూరు: జీఎస్టీపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని దెందులూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓలు, ఏపీఎంలు, సీడీపీఓ పాల్గొన్నారు.

1న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి క్లాసులు

ఏలూరు (టూటౌన్): ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి క్లాసులను నవంబర్ 1,2, 3, 4 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్టు నాయకులు తెలిపారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ అత్యవసర సమావేశం శుక్రవారం యూనియన్ స్థానిక ఆఫీస్ వద్ద సెక్రటరీ యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యూ.వీ.), ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు, నాయకులు బి.సోమయ్య మాట్లాడారు.

నేడు ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా సమావేశం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (కపర్ది భవనం) ఆఫీసులో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షులు కుందేటి జయరాజు, జిల్లా కార్యదర్శి ఎల్ రాంబాబులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం నాయకులు పి.మనోజ్, కుమారి, వీర్రాజు, సీహెచ్ వాసు తదితరులు పాల్గొన్నారు.